

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 7 బుధవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 244 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

WEDNESDAY OCTOBER 7 2026 | VOL:18 | ISSUE: 244 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

విజయ్‌కి భయపడుతున్నారా? రాహుల్ గాంధీని నిలదీసిన డీఎంకే

సీఈసీకి వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాల నిరసన

రాహుల్ గాంధీని సూటిగా ప్రశ్నించిన డీఎంకే

తమిళనాడు ఓటర్ల జాబితాపై వైఖరి చెప్పాలని డిమాండ్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్న వేళ, ఆయనకు ఊహించని రాజకీయ సెగ తగిలింది. ఒకప్పటి మిత్రపక్షమైన తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ, రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించింది. డీఎంకే నేత శరవణన్ అన్నదురై సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీని సూటిగా ప్రశ్నించారు. "తమిళనాడులో ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపుపై రాహుల్ గాంధీ వైఖరి ఏమిటి? 'సర్' అనంతరం ఎన్నికైన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయాలన్న మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను ఆయన ఎందుకు సమర్థించడం లేదు? తమిళనాడులో 'సర్' గురించి



మాట్లాడటానికి విజయ్‌కి భయపడుతున్నారా? ఇది ఎంతటి ద్వంద్వ నీతి" అని తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ, డీఎంకేతో పొత్తును తెంచుకోవడం తెలిసిందే. ఈ పరిణామంతో తీవ్ర అసంతృప్తికి లోనైన డీఎంకే, ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి నుంచి కూడా వైదొలగింది. సీఈసీకి వ్యతిరేకంగా సాగే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని చెబుతూనే, తాజాగా రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

పులిచింతలలో విద్యుత్‌పై భట్టి కీలక వ్యాఖ్యలు.. 8 వేల మెగావాట్ల అదనపు భారం ఉన్నా కోతలు లేవు

పులిచింతల, అక్టోబర్ 6 (విజయ కెరటం):

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినా ప్రజలకు ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ పీక్ డిమాండ్ దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందని, గతంలో ఇదే సమయంలో 15 వేల మెగావాట్లుగా ఉండేదని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరగడం, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో మొత్తంగా 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాయని వెల్లడించారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని, నీటి కొరత కారణంగానే ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. రాత్రి వేళల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ పవర్ ద్వారా అధిగమిస్తున్నామని, గృహ వినియోగదారులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నీటిని పొదుపుగా వినియోగించాలి రాబోయే రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారని భట్టి తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు

(మిగతా 2వ పేజీలో..)






మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత

ప్రజాసేవ చేసేందుకు మాజీ మావోలు తమ పార్టీలో చేరాలన్న కవిత

వేములవాడ ఆలయంలో మేత, నీరు లేక గోవులు మరణిస్తున్నాయని ఆవేదన

కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని వ్యాఖ్య



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులు ప్రజాసేవ చేసేందుకు తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. వారి రాకతో తమ పార్టీ మరింత

(మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

సం పా దకీయం

పుస్తక పఠనం తగ్గుతోంది.. ఆలోచనా శక్తి పెరగాలి

ప్రపంచం ఎంత వేగంగా మారుతున్నా పుస్తకానికి ఉన్న ప్రాధాన్యం తగ్గదు. కానీ మారుతున్న జీవనశైలి, డిజిటల్ పరికరాల విస్తృత వినియోగం, సోషల్ మీడియా ప్రభావంతో పుస్తక పఠనానికి కేటాయించే సమయం క్రమంగా తగ్గుతోంది. చిన్న సమాచారం కోసం కూడా మొబైల్ తెరిచి చూసే అలవాటు పెరిగిపోయింది. క్షణాల్లో సమాచారం అందుతున్నప్పటికీ.. లోతుగా చదివే, ఆలోచించే, విశ్లేషించే అలవాటు మాత్రం తగ్గుతున్నదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పఠనం అనేది కేవలం పరీక్షల కోసం చేసే అధ్యయనం కాదు. అది మనిషి ఆలోచనా పరిధిని విస్తరిస్తుంది. కొత్త విషయాలను పరిచయం చేస్తుంది. భిన్న అభిప్రాయాలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. ఒక మంచి పుస్తకం మనకు తెలియని ప్రపంచాన్ని పరిచయం చేయగలదు. మన అనుభవాలకు భిన్నమైన జీవితాలను అర్థం చేసుకునే అవకాశం ఇస్తుంది.

చదివే అలవాటు చిన్నప్పటి నుంచే

పిల్లల్లో పుస్తక పఠన అలవాటు చిన్న వయసు నుంచే పెంచాలి. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా కథలు, జీవిత చరిత్రలు, విజ్ఞాన పుస్తకాలు, చరిత్ర, సాహిత్యం వంటి అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండాలి. పిల్లల చేతిలో ఎప్పుడూ మొబైల్ పెట్టడం కంటే.. వారి ఆసక్తికి తగ్గ పుస్తకాలను పరిచయం చేయడం ఎంతో ప్రయోజనకరం. ఇంట్లో తల్లిదండ్రులు చదివే అలవాటును పాటిస్తే పిల్లలు కూడా అనుసరించే అవకాశం ఉంటుంది. పుస్తకం చదవడాన్ని శిక్షగా కాకుండా ఆనందంగా అనుభవించేలా వాతావరణం కల్పించాలి. రోజుకు కొద్దిసేపైనా పఠనానికి కేటాయించే అలవాటు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది.

సమాచారం వేరు.. జ్ఞానం వేరు

ఇంటర్నెట్‌లో వేలాది సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వస్తోంది. కానీ సమాచారం ఎక్కువగా ఉండటం మాత్రమే జ్ఞానానికి సంకేతం కాదు. దాన్ని అర్థం చేసుకోవాలి, విశ్లేషించాలి, నిజానిజాలను తెలుసుకోవాలి. పుస్తక పఠనం ఈ సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి విషయాన్ని నిజమని నమ్మే పరిస్థితి ప్రమాదకరం. ముఖ్యంగా తప్పుడు వార్తలు, అపోహలు, అసంపూర్ణ సమాచారం వేగంగా వ్యాపిస్తున్న కాలంలో విమర్శనాత్మక ఆలోచన అవసరం. పఠనం మనలో ప్రశ్నించే స్వభావాన్ని పెంచుతుంది. ఏది నిజం? ఎందుకు? దాని వెనుక ఉన్న కారణం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం వెతికే అలవాటు ఏర్పడుతుంది.

గ్రంథాలయాలు మళ్లీ సందడిగా మారాలి

పుస్తక పఠనాన్ని పెంచాలంటే గ్రామాలు, పట్టణాల్లోని గ్రంథాలయాలను బలోపేతం చేయాలి. ఆధునిక పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, బాల సాహిత్యం, స్థానిక చరిత్ర, విజ్ఞాన అంశాల పుస్తకాలు అందుబాటులో ఉండాలి. చదువుకునేందుకు అనువైన వాతావరణం కూడా అవసరం. గ్రంథాలయాలను కేవలం పుస్తకాలు ఉంచే గదులుగా కాకుండా.. జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. పుస్తక చర్చలు, రచయితలతో సమావేశాలు, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన కార్యక్రమాలు నిర్వహిస్తే యువతలో పఠనంపై ఆసక్తి పెరగవచ్చు.

యువతలో పఠన సంస్కృతి పెరగాలి

యువత భవిష్యత్తును నిర్మించే శక్తి. వారికి ఉద్యోగ నైపుణ్యాలతో పాటు సామాజిక అవగాహన కూడా అవసరం. దేశ చరిత్ర, రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, విజ్ఞానం, సాహిత్యం వంటి అంశాలపై చదివిన యువతలో విశ్లేషణాత్మక దృష్టి పెరుగుతుంది. ఒక పరీక్షలో విజయం సాధించడం మాత్రమే విద్యకు లక్ష్యం కాదు. సమాజాన్ని అర్థం చేసుకునే వ్యక్తిత్వం పెంపొందించుకోవడం కూడా అంతే ముఖ్యం. పుస్తకాలు ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తాయి.

డిజిటల్ పఠనాన్నీ ప్రోత్సహించవచ్చు

పుస్తకం అంటే తప్పనిసరిగా ముద్రిత కాగితం మాత్రమే కాదు. ఈ-బుక్స్, డిజిటల్ గ్రంథాలయాలు, ఆడియోబుక్స్ వంటి ఆధునిక మార్గాలను కూడా ఉపయోగించవచ్చు. సాంకేతికతను పఠనానికి ప్రత్యర్థిగా కాకుండా సహాయక సాధనంగా మార్చుకోవాలి. అయితే డిజిటల్ పఠనంలోనూ ఏకాగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకవైపు పుస్తకం చదువుతూ మరోవైపు నోటిఫికేషన్లు, సోషల్ మీడియా సందేశాలతో దృష్టి మరలితే పఠనం ప్రభావం తగ్గుతుంది. కాబట్టి చదువుకునే సమయంలో అంతరాయాలను తగ్గించడం అవసరం.

పుస్తకాలు సమాజాన్ని మార్చగలవు

చరిత్రలో అనేక సామాజిక మార్పులకు ఆలోచనలే పునాది. ఆ ఆలోచనలు ప్రజల్లోకి వెళ్లేందుకు పుస్తకాలు ముఖ్యమైన సాధనాలుగా పనిచేశాయి. సమాజంలోని అన్యాయాలు, అసమానతలు, సమస్యలను ప్రశ్నించే చైతన్యాన్ని పఠనం పెంచుతుంది. ఒక పుస్తకం ఒక వ్యక్తిని మార్చవచ్చు.. ఒక ఆలోచన ఒక సమాజాన్ని మార్చవచ్చు. అందుకే పుస్తక పఠనాన్ని పాత అలవాటుగా కాకుండా భవిష్యత్తును నిర్మించే సాధనంగా చూడాలి. విద్యార్థులు, యువత మాత్రమే కాదు.. ప్రతి వయసువారూ తమకు నచ్చిన అంశంపై చదివే సమయాన్ని కేటాయించాలి.

చదువుకు సమయం కేటాయించడం పెట్టుబడే

రోజంతా మొబైల్, టెలివిజన్, సామాజిక మాధ్యమాల్లో గడిపే సమయం నుంచి కొంత భాగాన్ని పుస్తకానికి కేటాయించగలిగితే ఆ మార్పు వ్యక్తిత్వంపై స్పష్టంగా కనిపిస్తుంది. రోజుకు కొన్ని పేజీలతో ప్రారంభించినా.. కాలక్రమంలో అది మంచి అలవాటుగా మారుతుంది. సమాచారం కోసం మొబైల్ అవసరం కావచ్చు.. జ్ఞానం కోసం పుస్తకం అవసరం. వేగంగా స్క్రోల్ చేసే సంస్కృతిని దాటి.. నెమ్మదిగా చదివి లోతుగా ఆలోచించే అలవాటు పెరగాలి. పుస్తకాలు అలమారాల్లో కాకుండా చేతుల్లోకి రావాలి. పఠనం పెరిగితే ఆలోచన పెరుగుతుంది.. ఆలోచన పెరిగితే సమాజం ముందుకు సాగుతుంది.

పులిచింతలలో విద్యుత్‌పై భట్టి కీలక వ్యాఖ్యలు.. 8 వేల మెగావాట్ల అదనపు భారం ఉన్నా కోతలు లేవు





మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని కోరారు.

27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించే పథకం కోసం సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత

మొదటి పేజీ తరువాయి)

బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా, వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కవిత పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణంలో కాంక్రీట్ వాడటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగమశాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో నిర్మిస్తేనే ఆలయం వందల ఏళ్లపాటు నిలుస్తుందని, చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తులు సమర్పించిన గోవులు సరైన మేత, నీరు లేక మరణిస్తున్నాయని, వాటికి కనీసం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు కూడా జరపడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "అడవిని వదిలేసి వచ్చిన మాజీ మావోయిస్టులు ప్రజా జీవితంలోకి రండి.. మా పార్టీ మీకు మంచి ప్లాట్‌ఫామ్" అని కవిత పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా సిరిసిల్ల-వేములవాడ ప్రాంతంలో సాగునీటి పనులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని, అందుకే ప్రజలు తమలాంటి కొత్త పార్టీల వైపు చూస్తున్నారని విమర్శించారు. అంతకుముందు, ఆమె శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

4 లక్షలు తీసుకుంటూ ఒకరు.. లక్ష తీసుకుంటూ మరొకరు.. ఏసీబీ చేతికి చిక్కిన ఇద్దరు మహిళా అధికారులు

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి అరెస్ట్

రూ. లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత అరెస్ట్

నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత

అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ ఏసీబీ అధికారులు సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఇద్దరు మహిళా ప్రభుత్వ అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ తులసీరామ్ సునీత లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న స్వర్ణకుమారి ఎల్‌బీనగర్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న ఓ ఫిజియోథెరపీ కేంద్రంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు, కొత్త లైసెన్స్ ఇచ్చేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ద్వారా రూ. లక్షను స్వీకరించి, తన ప్రైవేట్ డ్రైవర్ మద్దూరి కృష్ణయ్యకు అప్పగించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, డబ్బుతో వెళ్తున్న కృష్ణయ్యను పట్టుకున్నారు. అనంతరం స్వర్ణకుమారి నివాసం, కార్యాలయంలో సోదాలు జరిపి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో స్వర్ణకుమారితో పాటు శ్రీనివాస్, కృష్ణయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.మరో ఘటనలో, జీహెచ్ఎంసీ మెహిదీపట్నం జోన్‌లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తులసీరామ్ సునీత, నిర్మాణ అనుమతుల కోసం ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షలు



డిమాండ్ చేశారు. ముందుగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద లెక్కల్లో చూపని మరో రూ.2.50 లక్షల నగదును కూడా గుర్తించి, మొత్తం రూ.6.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను అరెస్టు చేసి, నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ రెండు ఘటనలపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఇందిరమ్మ టవర్స్ కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు: మంత్రి పొంగులేటి

సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్, అక్టోబరు 6

సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (ఎవశ్రీఖఅవ్రుఖఖ వీఅఅఱ్‌వతీ గ్రాశీఅస్రబశ్రీవ్ఱ గాతీఅఅఅజుంఖ =వనసఎ) స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఏడాదిలోపే వీటిని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం వేగవంతం చేసే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పుకొచ్చారు. ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..

కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో ఇళ్ల కోసం 7 వేల మందికి పైగా దరఖాస్తు చేశారని.. వీరిలో 5,218 మందిని అర్హులుగా గుర్తించామని మంత్రి పొంగులేటి తెలిపారు. బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేశామని స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్‌లో మూడు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని వివరించారు. ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని చెప్పుకొచ్చారు.



పేదల సొంతింటి కలను కార్యరూపంలోకి తెస్తున్నాం..

ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపడతామని మంత్రి పొంగులేటి అన్నారు. ఈ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. పేదల సొంతింటి కలను కార్యరూపంలోకి తెస్తున్నామని అన్నారు. 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

అక్టోబర్ | బుధవారం | 7 | 2026

పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలే అండ

స్మార్ట్ రేషన్ కార్డులు, వివాహ సాయం చెక్కుల పంపిణీ

వరంగల్ విజయ కెరటం 06 అక్టోబర్ :

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ పైడిపల్లిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులకు నిత్యావసర సరుకులతో పాటు వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందనున్నాయని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పైడిపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను ప్రారంభించారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణకర్, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మాజీ కార్పొరేటర్ జన్ను శిభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్దే పెద్దన్న, వరంగల్ మండల తాసిల్దార్ శ్రీకాంత్,సీనియర్ నాయకులు అభిషేకం, సంపత్, రవికుమార్, రాజు, వంశీ, బోయినీ ఐలయ్య, గట్టు బాలరాజు, జాన్సన్, నవీన్, సతీష్, ప్రసాద్, ఏనుమాముల సిఐ జి సురేష్,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పండుగలకు పకడ్బందీ భద్రత





జనసందోహంపై ప్రత్యేక నిఘా.. ఏర్పాట్లపై కొండా సురేఖ ఆదేశం

వరంగల్, విజయ కెరటం,06అక్టోబర్:

దసరా, సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు భారీగా తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం రంగలీల మైదానం, ఉర్సుగుట్ట, కరీమాబాద్, ఉర్సు ప్రాంతాల్లో జరగనున్న ఉత్సవాలు, రావణ వధ కార్యక్రమాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే నేపథ్యంలో భద్రత, బారికేడింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రావణ వధ కార్యక్రమం వద్ద అగ్నిమాపక, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధీకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కొండా సురేఖ స్పష్టం చేశారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న, ఖిల్లా వరంగల్ తహసిల్దార్ మహ్మద్ ఇక్బాల్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, ఉత్సవ కమిటీ సభ్యులు నాగపురి సంజయ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల మధ్య తలసాని జన్మదిన వేడుకలు





అనాథాశ్రమంలో అన్నదానం.. పండ్ల పంపిణీ

వరంగల్ విజయ కెరటం, 06 అక్టోబర్:

మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి యువశక్తి అనాథాశ్రమంలో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.అనంతరం వృద్ధులకు అన్నదానం నిర్వహించి పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనాథ పిల్లలకు విద్యా సామగ్రి, మహిళలకు చీరలు, పేదలకు దుప్పట్లు తదితరాలను గతంలో పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా నిరుపేదలు, అనాథలు, వృద్ధులకు కొంతమేర అండగా నిలవాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు.కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మెండే మల్లేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పంభాల ఎర్రన్న యాదవ్, బీమారం మండల ప్రధాన కార్యదర్శి కేశవేణి సత్యనారాయణ యాదవ్, కల్వరి యువశక్తి డైరెక్టర్ కుమార్, జంగపెల్లి శ్రీధర్, పూసల రమేష్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...


ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



అండర్ బ్రిడ్జి కింద మురుగు కష్టాలు!

పాదచారులపై చిలకరింపులు.. అధికారులపై ప్రశ్నలు

వరంగల్ విజయ కెరటం, 06 అక్టోబర్ :



వరంగల్ తూర్పు అండర్ రైల్వే బ్రిడ్జి కింద మురుగునీరు నిలిచిపోవడంతో మంగళవారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మురుగు కాలువల నుంచి వచ్చే నీరు బ్రిడ్జి కింద నిలవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు నీటిలోంచి వెళ్లే సమయంలో మురుగునీరు పాదచారులపై చిమ్ముతుండటంతో అవస్థలు తప్పడం లేదు.ఎండలు మండుతున్నా మురుగునీరు నిలిచిపోవడం డ్రైనేజీ వ్యవస్థపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు దుర్వాసనతో పాటు మురుగునీటి చిలకరింపులతో ఇబ్బందులు పడుతున్నారు.సమస్య ఏళ్లుగా కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం లేకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు నిలవకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మిర్యాలగూడలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు స్థల పరిశీలన





నల్గొండ, అక్టోబర్ 6 (విజయ కెరటం):

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఒక్కో పాఠశాలలో సుమారు 2,500 మంది విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు.మిర్యాలగూడ నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కోసం మంగళవారం మిర్యాలగూడ మండలం జప్తి వీరప్పగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 214లో సుమారు 20 నుంచి 25 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి అనువైన స్థల వివరాలు, లేఅవుట్లు, భూ రికార్డులను సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదులు, డార్మెటరీలు, కిచెన్, డైనింగ్ హాల్, ల్యాబ్‌లు, లైబ్రరీ, ఆట స్థలాలు తదితర అన్ని సౌకర్యాలను కల్పించి కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దనున్నట్లు అధికారులు తెలిపారు.కలెక్టర్ వెంట మైనింగ్ ఏడీ రవికుమార్, ఆర్ఐలు రామకృష్ణ, కృష్ణయ్య, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస్ రెడ్డి, సర్వేయర్లు శ్రీనివాస్, సైదులు, నరసింహ తదితరులు ఉన్నారు.

ఉద్యోగార్థులకు శుభవార్త.. నల్గొండలో మినీ జాబ్ మేళా

నల్గొండ, అక్టోబర్ 6 (విజయ కెరటం):

నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 8న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నల్గొండ బీటీఎస్ రోడ్‌లోని ఐటీఐ క్యాంపస్ పక్కన ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ జాబ్ మేళా జరుగుతుంది. Powerlinks Infratech Pvt Ltd, Aditya Organic Eco, Quesscorp Pvt Ltd సంస్థలు ఉద్యోగులను ఎంపిక చేయనున్నాయి. SSC, ఇంటర్మీడియట్, ITI, డిప్లొమా, B.Tech విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి నల్గొండ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉద్యోగాలు కల్పించనుండగా, నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం అందనున్నట్లు అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. సమాచారం కోసం: 08682-2233362, 7893420435.

పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధే లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్షాది

సూర్యాపేట సెప్టెంబర్ 6 విజయకేరటం ప్రతినిధి:



పట్టణాన్ని పార్టీలకు అతీతంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మున్సిపాలిటీ లక్ష్యమని సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సోమవారం పట్టణంలోని 43వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. వార్డుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బత్తుల జాన్సీ రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ డీఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలయ్యతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

రూ.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం.. అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్





సూర్యాపేట: సెప్టెంబర్ 6 విజయ కెరటం ప్రతినిధి

జిల్లాతో పాటు నల్గొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు, వైన్స్ షాపులు, వ్యవసాయ బావుల వద్ద చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను ఆత్మకూర్(ఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన నగదు, బంగారు--వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వ్యవసాయ పరికరాలు, మద్యం సీసాలు, వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ కేసు వివరాలను వెల్లడించారు. గత ఆగస్టు 30న పాత సూర్యాపేటలోని బొక్క వెంకట్‌రెడ్డి ఇంట్లో జరిగిన చోరీపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులను పట్టుకున్నారు. పాత సూర్యాపేట ఎక్స్ రోడ్డు వద్ద సూర్యాపేట--దంతాలపల్లి రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మూడు మోటార్‌సైకిళ్లపై వ్యవసాయ మోటార్‌ను తరలిస్తున్న ఐదుగురిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల వ్యవహారం వెలుగులోకి వచ్చింది.అరెస్ట్ అయిన వారిని పాత సూర్యాపేటకు చెందిన సురికంటి నరేష్ ఏ నరేష్ రెడ్డి, మేరెడ్డి మహిపాల్ రెడ్డి ఏ ప్రీతం రెడ్డి, పన్నాల గిరిధర్ రెడ్డి, శివరాత్రి అరవింద్ ఏ అరుణ్, పులగంవారిగూడెంకు చెందిన కాసాల ఉదయ్ కిరణ్ రెడ్డి ఏ కిరణ్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు.

8 చోరీ కేసులు ఛేదింపు

విచారణలో సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) పరిధిలో 2, చివ్వెంల పరిధిలో 2, సూర్యాపేట రూరల్ పరిధిలో 3, నల్గొండ జిల్లా నకిరేకల్ పరిధిలో 1.. మొత్తం 8 చోరీ కేసులకు ఈ ముఠా పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

భారీగా చోరీ సొత్తు స్వాధీనం

నిందితుల నుంచి రూ.1.20 లక్షల నగదు, సుమారు 7.5 తులాల బంగారం, 20.5 తులాల వెండి, మూడు స్మార్ట్ టీవీలు, సౌండ్‌బార్, మైక్రోవేవ్ ఓవెన్, ఇన్వర్టర్, బ్యాటరీ, రెండు 5 హెచ్‌పీ సబ్‌మర్సిబుల్ మోటార్లు, సుమారు 30 మీటర్ల కరెంట్ వైరు, 740కి పైగా మద్యం సీసాలు/క్వార్టర్లు, మూడు మోటార్‌సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించడం, జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత ఏడాది కాలంగా ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. చోరీ చేసిన నగదు, వస్తువులను విక్రయించి వచ్చిన డబ్బును జల్సాలకు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు.ముఠాను పట్టుకోవడంలో డీఎస్పీ వి. ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో, సూర్యాపేట రూరల్ సీఐ పర్యవేక్షణలో ఆత్మకూర్(ఎస్) ఎస్సై ఎం. ఐలయ్య, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఎస్పీ తెలిపారు. పోలీసు బృందాన్ని ఆయన అభినందించారు. ప్రజలు విలువైన వస్తువులు, నగదు భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

‘ది ట్రెయిటర్స్’.. 20 మంది సెలబ్రిటీలతో సరికొత్త రియాలిటీ షో.. హోస్ట్‌గా తేజ సజ్జా

హోస్ట్‌గా మారిన యంగ్ హీరో తేజ సజ్జా

ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్న ‘ది ట్రెయిటర్స్ తెలుగు’

20 మంది ప్రముఖ సెలబ్రిటీలతో సరికొత్త రియాలిటీ షో

ఈ గేమ్ నాక్కూడా అనూహ్యమేనంటున్న తేజ సజ్జా

తాజాగా విడుదలైన ‘ది ట్రెయిటర్స్ తెలుగు’ ట్రైలర్



టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా సరికొత్త అవతారంలోకి మారారు. నటుడిగా వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఆయన, ఇప్పుడు హోస్ట్‌గా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్న ‘ది ట్రెయిటర్స్ తెలుగు’ అనే రియాలిటీ షోకు తేజ హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. “మోసం ఇక్కడ కొత్త రూల్” అనేది క్యాప్షన్. మంగళవారం ఈ షోకు సంబంధించిన ట్రైలర్‌ను నిర్వాహకులు విడుదల చేశారు.ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన ‘ది ట్రెయిటర్స్’ ఫార్మాట్‌ను తొలిసారిగా తెలుగులోకి తీసుకువస్తున్నారు. ఈ షోలో వివిధ రంగాలకు చెందిన 20 మంది ప్రముఖులు పాల్గొంటున్నారు. వారిలో సింగర్ చిన్మయి శ్రీపాద, నటులు హర్షవర్ధన్, ప్రగతి, శ్రీదేవి చౌదరి, నిఖిల్ విజయేంద్ర సింహ, విద్యుల్లత రామన్, విష్ణు ఓయ్, సాయి రోనక్ వంటి పలువురు సెలబ్రిటీలు ఉన్నారు.ఈ షో గురించి తేజ సజ్జా మాట్లాడుతూ.. “‘ది ట్రెయిటర్స్ తెలుగు’కు హోస్ట్‌గా వ్యవహరించడం నాకు పూర్తిగా కొత్త అనుభవం. ఇప్పటివరకు నేను చేసిన వాటికి ఇది పూర్తి భిన్నమైనది కావడంతో చాలా ఉత్సాహంగా ఉన్నాను” అని తెలిపారు. “ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఒక ఫార్మాట్‌ను తొలిసారి తెలుగులోకి మన అభిరుచికి తగ్గట్టుగా తీసుకురావడం సంతోషంగా ఉంది” అని ఆయన పేర్కొన్నారు.“నిజం చెప్పాలంటే, ఈ గేమ్ కంటెస్టెంట్స్‌కు ఎంత అనూహ్యమో, హోస్ట్‌గా నాక్కూడా అంతే అనూహ్యం. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో క్షణాల్లో మారిపోతుంది. అబద్ధాలు, మైండ్ గేమ్స్, ఊహించని పొత్తులతో ఈ షో చాలా ఆసక్తికరంగా సాగుతుంది. ఈ షోతో ప్రేక్షకులు కూడా ఎంతో ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను,” అని తేజ వివరించారు. అబద్ధాలు, నమ్మకద్రోహాల మధ్య సాగే ఈ సైకలాజికల్ గేమ్ షో త్వరలోనే ప్రైమ్ వీడియోలో ప్రసారం కానుంది.

ఏకంగా 15 నిమిషాలు ఊపిరి బిగబట్టిన బాలీవుడ్ నటుడు.. అనుకరిస్తే ప్రాణాలకే ముప్పు అంటున్న నిపుణులు

ముంబై ఈవెంట్‌లో 15 నిమిషాలు ఊపిరి బిగబట్టిన విద్యుత్ జమ్వాల్

హాలీవుడ్ చిత్రం ‘స్ట్రీట్ ఫైటర్’ ప్రమోషన్‌లో భాగంగా ఈ ప్రదర్శన

ఇది పతంజలి యోగ సూత్రాల్లోని ఒక టెక్నిక్ అని చెప్పిన నటుడు

సాధారణ ప్రజలు దీన్ని అనుకరించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక

శిక్షణ లేకుండా ప్రయత్నిస్తే ప్రాణాలకే ముప్పు తప్పదని నిపుణుల స్పష్టీకరణ

ప్రముఖ బాలీవుడ్ నటుడు, మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు విద్యుత్ జమ్వాల్ ఓ అరుదైన, ప్రమాదకరమైన విన్యాసాన్ని ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ముంబైలో జరిగిన ‘స్ట్రీట్ ఫైటర్’ అనే తన హాలీవుడ్ చిత్రం ప్రమోషనల్ ఈవెంట్‌లో ఆయన సుమారు 15 నిమిషాల పాటు శ్వాసను బంధించి ధ్యాన ముద్రలో నిశ్చలంగా ఉన్నారు. తాను ఈ చిత్రంలో యోగా గురువు ‘ధల్సిమ్’ పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఆ పాత్రకు సంబంధించిన నైపుణ్యాన్ని చూపించేందుకే ఈ ప్రదర్శన ఇచ్చారు.ఈ సందర్భంగా విద్యుత్ జమ్వాల్ మాట్లాడుతూ.. ఇది పతంజలి యోగ సూత్రాల నుంచి తాను నేర్చుకున్న ఒక పురాతన టెక్నిక్ అని తెలిపారు. శ్వాసను బిగబట్టినంత సేపు కళ్లు తెరిచే ఉంచగా, సమయం గడిచేకొద్దీ ఆయన కళ్ల నుంచి నీళ్లు రావడం కనిపించింది. జీవితంలో లక్ష్యాల కోసం నిరంతరం పరుగులు పెట్టకుండా, కాసేపు ఆగి నిదానించడం కూడా ముఖ్యమని ఆయన అన్నారు. ఈ యోగ పద్ధతిని తాను యువతకు కూడా నేర్పిస్తున్నట్లు విద్యుత్ పేర్కొన్నారు.అయితే, విద్యుత్ జమ్వాల్ చేసిన ఈ విన్యాసంపై ఆరోగ్య నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఎక్కువ సేపు ఊపిరి బిగబట్టడం సాధారణ ప్రజలకు అత్యంత ప్రమాదకరమని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని అనుకరించవద్దని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ జమ్వాల్ లాంటి శిక్షణ పొందిన అథ్లెట్లు, యోగా నిపుణులు సంవత్సరాల సాధన ద్వారా తమ శరీరాన్ని తక్కువ ఆక్సిజన్ స్థాయిలకు అలవాటు చేసుకుంటారని, కానీ ఎలాంటి శిక్షణ లేని వారు ప్రయత్నిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని స్పష్టం చేశారు.శిక్షణ లేకుండా ఇలాంటి ప్రయత్నాలు చేస్తే ‘హైపోక్సియా’ (శరీరానికి ఆక్సిజన్ సరఫరా తగ్గడం) బారిన పడే ప్రమాదం ఉంది. దీనివల్ల తల తిరగడం, స్పృహ కోల్పోవడం, మెదడు దెబ్బతినడం జరిగి మరణం సంభవించవచ్చు. ముఖ్యంగా ఎక్కువ సేపు శ్వాస ఆపడం కోసం ముందుగా గట్టిగా ఊపిరి పీల్చి వదలడం (హైపర్‌వెంటిలేషన్) మరింత ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. సాంప్రదాయ ప్రాణాయామ పద్ధతుల్లో శ్వాసను నియంత్రించడం ఒక భాగమే అయినప్పటికీ, దానికి సరైన శిక్షణ, నిపుణుల పర్యవేక్షణ తప్పనిసరి. గుండె, ఊపిరితిత్తులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇలాంటి కఠినమైన పద్ధతులకు దూరంగా ఉండాలని, వైద్యుల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. విద్యుత్ జమ్వాల్ ప్రదర్శించింది సంవత్సరాల కఠోర సాధన ఫలితమేనని, దీన్ని ఒక ఫిట్‌నెస్ ఛాలెంజ్‌గా భావించి ఎవరూ ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



“అందుకే మా రిలేషన్‌షిప్‌ను సీక్రెట్‌గా ఉంచాం”.. ఆసక్తికర విషయాలను పంచుకున్న విజయ్–రష్మిక

సెలబ్రిటీల ప్రేమకథల్లో ఏదో ఒక దశలో ‘ఎప్పుడు ప్రేమలో పడ్డారు?’, ‘ఎవరు ముందుగా ప్రపోజ్ చేశారు?’ అనే ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ విషయంలో మాత్రం ఈ ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పడం కాస్త కష్టమే. ఎందుకంటే.. తమ బంధానికి వాళ్లు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన తేదీ పెట్టుకోలేదు. ప్రేమను ప్రకటించుకోలేదు. ప్రపోజ్ కూడా చేసుకోలేదు. అయినా ఒకరితో ఒకరు ఉంటూ.. తమ బంధం ఎప్పుడు ప్రేమగా మారిందో తెలియకుండానే పెళ్లి వరకు వచ్చేశారు.2026 ఫిబ్రవరిలో రష్మిక, విజయ్ పెళ్లి చేసుకున్నారు. అప్పటివరకు వీరిద్దరి గురించి ఎన్నో వార్తలు వచ్చినా.. తమ వ్యక్తిగత జీవితంపై మాత్రం ఇద్దరూ పెద్దగా మాట్లాడలేదు. తాజాగా ‘రణబాలి’ ప్రమోషన్లలో భాగంగా శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఈ జంట.. చాలాకాలం తమ రిలేషన్‌షిప్‌ను ఎందుకు ప్రైవేట్‌గా ఉంచారో చెప్పారు.

కోస్టార్‌గా మొదలై.. జీవిత భాగస్వామిగా

విజయ్ మాటల్లో చెప్పాలంటే.. రష్మికతో తన పరిచయం తొలుత ప్రేమతో మొదలవలేదు. ఇద్దరూ కలిసి పనిచేసే కోస్టార్స్ అంతే. ఆ పరిచయం కాస్తా స్నేహంగా మారింది. అది పెరిగేకొద్దీ ఒకరంటే ఒకరికి ఇష్టం పెరిగింది. చివరికి అదే బంధం పెళ్లి వరకు వెళ్లింది.అయితే ఈ మొత్తం ప్రయాణాన్ని తాము దాచిపెట్టేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని విజయ్ చెప్పాడు. బయట ప్రపంచానికి తమ బంధం గురించి చెప్పాలనే అవసరం మాత్రం తనకు అనిపించలేదన్నాడు. తన వ్యక్తిగత జీవితం గురించి అందరికీ చెప్పాల్సిన బాధ్యత తనపై లేదనే భావనతోనే ఉన్నానని విజయ్ స్పష్టం చేశాడు.

‘మా బంధం.. మా కోసమే’

రష్మిక కూడా ఇదే విషయాన్ని మరో కోణంలో చెప్పింది. తమ రిలేషన్‌షిప్ ఎవరి వినోదం కోసమో లేదంటే గాసిప్ కోసమో కాదని పేర్కొంది. “మన జీవితంలో కొన్ని విషయాలు మనకు చాలా ప్రత్యేకమైనవి. వాటిని మన దగ్గరే ఉంచుకోవాలనుకుంటాం” అనే భావనతోనే తమ బంధాన్ని ప్రైవేట్‌గా ఉంచుకున్నామని రష్మిక వివరించింది.

పెళ్లి ఆలోచన ఎప్పుడు వచ్చిందంటే..

అయితే విజయ్‌కు పెళ్లి ఆలోచన ఒక్కరోజులో రాలేదు. పెళ్లికి ఏడాది ముందు తన జీవితంలో రష్మిక ఎంత ముఖ్యమైపోయిందో తనకే అర్థమైందని అతడు చెప్పాడు. ఆమెతో కలిసి ఏ పని చేసినా తనకు మరింత ఆనందంగా అనిపించేదట. కలిసి పని చేయడం, ట్రైనింగ్‌కు వెళ్లడం.. చివరకు కలిసి భోజనం చేయడం కూడా ప్రత్యేకంగానే అనిపించేదని విజయ్ చెప్పాడు. ఒంటరిగా తింటున్నప్పుడు కూడా ‘రష్మిక ఇక్కడ ఉంటే బాగుండేది’ అనే ఆలోచన వచ్చేదట. తన రోజువారీ జీవితంలో చిన్న చిన్న సందర్భాల్లోనూ ఆమెను మిస్ అవుతున్నానని విజయ్ గుర్తించాడట. అప్పుడు తనకు అసలు విషయం అర్థమైందని.. జీవితంలో ప్రతి చిన్న ఆనందాన్ని రష్మికతో పంచుకుంటేనే మరింత బాగుంటుందని తెలిసొచ్చిందని చెప్పుకొచ్చాడు. అక్కడి నుంచే పెళ్లి ఆలోచన బలపడిందని వివరించాడు.

‘మనం ఒకరితో ఒకరం ఉంటేనే బాగుంటాం’

రష్మికకు కూడా తమ బంధం గురించి ఇదే తరహా అనుభూతి కలిగిందట. ఒకరినొకరు మూడు, నాలుగేళ్లు తెలుసుకున్న తర్వాత తమ మధ్య ఉన్న అనుబంధం మిగతా స్నేహాలకు భిన్నమైందని ఆమెకు అర్థమైందట. ఇద్దరూ కలిసి ఉన్నప్పుడు తమ జీవితాలు మరింత సంపూర్ణంగా అనిపించేవని రష్మిక చెప్పింది. అయితే ‘ఈ రోజే ప్రేమలో పడ్డాం’ అని చెప్పేలా ఒక ప్రత్యేకమైన క్షణం అంటూ తమ కథలో లేదని తెలిపింది.

ప్రపోజ్ లేదు..

చాలా ప్రేమకథల్లో ఒకరు మోకాళ్లపై కూర్చొని ప్రపోజ్ చేయడం.. ఎదుటివారు ఓకే చెప్పడం ఉంటుంది. రష్మిక–విజయ్ కథలో మాత్రం అలాంటిదేమీ జరగలేదట. ఇద్దరూ ఒకరికొకరు ప్రత్యేకంగా ప్రేమను వ్యక్తపర్చుకోలేదని విజయ్ చెప్పాడు. ఎప్పుడు స్నేహం ప్రేమగా మారిందో కూడా ఇద్దరికీ కచ్చితంగా గుర్తులేదట. కానీ కలిసి గడిపిన ప్రతి రోజుతో ఆ అనుబంధం మరింత బలపడిందని చెప్పాడు. ఒకరంటే ఒకరికి ఇష్టం పెరిగిందని తెలిపారు. చివరికి అదే ప్రేమ జీవితాంతం కలిసి ఉండాలనే నిర్ణయానికి తీసుకెళ్లిందని వివరించారు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528